క్లుప్తంగా

ఏఎస్సైకు సత్కారం



ట్రాఫిక్ ఏఎస్సై రత్నంను సత్కరించిన ఆటో యూనియన్ నాయకులు

సామర్లకోట: ట్రాఫిక్ ఏఎస్సై రత్నంను పెద్దాపురం శ్రీలక్ష్మీగణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ట్రాఫిక్ విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు ఆయన పురస్కారాన్ని అందుకున్న నేపథ్యంలో యూనియన్ నాయకులు ఆయనను సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు సోమేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

చలివేంద్రం ప్రారంభం



సామర్లకోట బస్సు కాంప్లెక్స్‌లో మజ్జిగ చలివేంద్రం

సామర్లకోట: స్థానిక బస్సు కాంప్లెక్స్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. కాంప్లెక్స్ మేనేజరు వజ్రం మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం దీనిని ప్రారంభించినట్టు తెలిపారు. బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు మజ్జిగ తాగడానికి బారులు తీరారు. నిత్యం చల్లని నీటిని ఏర్పాటు చేస్తామని వజ్రం చెప్పారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు చేశారు.

ఘనంగా రామానుజన్ వర్ధంతి



రామానుజన్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సామర్లకోట: స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ వర్ధంని గణితావధాని, హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. నేటి విద్యార్థులందరికి రామనుజన్ ఆదర్శనీయమన్నారు. రామవరం హైస్కూల్ హెచ్‌ఎం యాళ్ల ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని రామనుజన్ జీవిత విశేషాలను వివరించారు. గణిత ఉపాధ్యాయులు కె అరుణ, డీవీఆర్ఎస్ వల్లీ, ఎ.శ్రీవల్లి, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.68.24 లక్షల ఆదాయం

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీకి శుక్రవారం రూ.68,24,072 ఆదాయం వచ్చిందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపాలిటీకి పన్నుల బకాయిగా ఉన్న నవభారత్ వెంచర్స్ సుగర్ ఫ్యాక్టరీ, ఎఫ్‌సీఐ గోదాములకు రెడ్ నోటీసులు జారీ చేశామని చెప్పారు. దాంతో రెండు సంస్థల నుంచి ఆ మొత్తం వచ్చిందని చెప్పారు. పన్నుల బకాయిదారులు సకాలంలో పన్నులు చేయించాలని ఆయన సూచించారు.

వలంటీర్ల రాజీనామా

కొత్తపల్లి: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆరుగురు వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. మూలపేటలో నలుగురు, కొత్త మూలపేటలో ఒక్కరు, అమీనాబాద్ ఒక్కరు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ వెంకట నారాయణ తెలిపారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారని చెప్పారు.

ప్రజల సహకారంతో మెరుగైన పారిశుధ్యం

కాకినాడ: ప్రజల సహకారం కూడా ఉన్నప్పుడే మెరుగైన పారిశుధ్య సేవలు అందించగలమని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఏడో డివిజన్ రేచర్లపేటలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ప్రజలతో స్వయంగా మాట్లాడి సేవలను ఆరా తీశారు. హూపర్ టిప్పర్ వాహనాలకు మాత్రమే చెత్తను అందించి నగరపాలక సంస్థకు సహకరించాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారం తోనే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలాని ఇతర సిబ్బంది ఉన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన



పిఠాపురంలో నామినేషన్లు పరిశీలిస్తున్న అధికారులు

- పిఠాపురంలో ఒక నామినేషన్ తిరస్కరణ
- 22 మంది అభ్యర్థుల నామినేషన్లకు అనుమతి

పిఠాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో రెండో ఘట్టం ముగిసింది. కాకినాడ జిల్లా జేసీ, పిఠాపురం నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేకాధికారి (ఆర్‌ఓ) రామ్ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. పిఠాపురం నియోజకవర్గంలో మొత్తం 23 మంది అభ్యర్థులు 35 సెట్ల నామినేషన్‌లో దాఖలు చేయగా వాటిని అధికారులు పరిశీలించారు. అభ్యర్థులు, వారి అనుచరుల సమక్షంలో నామినేషన్లను పరిశీలించిన అధికారులు ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. వైఎస్సార్ సీపీ తరఫున వంగా కాశీ విశ్వనాథ్ వేసిన అదనపు నామినేషన్ చెల్లుబాటు కాదని అధికారులు తెలిపారు. 22 మంది నామినేషన్లను అనుమతించిన అధికారులు



పిఠాపురంలో నామినేషన్ల పరిశీలనకు హాజరైన నాయకులు

అన్ని పార్టీల నాయకులు, స్వతంత్ర్య అభ్యర్థుల అంగీకారంతో వివరాలు ప్రకటించారు.

సక్రమంగా ఉన్న నామినేషన్లు ఇవే..

వైఎస్సార్ సీపీ నుంచి వంగా గీత, జనసేన నుంచి పవన్ కల్యాణ్, జైభీమ్‌రావ్ భారత్ పార్టీ నుంచి జగ్గారపు మల్లికార్జున, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బొండాడ జయరాజు, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థిగా ట్రాన్స్‌జెండర్ తమన్నా సింహాద్రి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి మద్దురి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ నుంచి మాదేపల్లి సత్యానందరావు, తెలుగు జనతా పార్టీ నుంచి పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థులుగా మొగలి లక్ష్మణమూర్తి, ఈటీ జగదీష్, పైండా వీరప్రభాకరరావు, బోలిశెట్టి గౌరీమణి, ఆదిమూలం గంగాధర్, పెయ్యల దుర్గాప్రసాద్, ప్రత్తిపాటి బుల్లి రాజు, ఏడిద భాస్కరరావు, టేకుమూడి శ్రీనివాసరావు, నాగం సూరిబాబు, పోలవరపు సత్యం, వాసం గీత, వేగి గీత, వేగిశెట్టి సాయి సూర్య నిఖిల్ నామినేషన్లను అధికారులు అనుమతించారు.

పవన్ నామినేషన్‌పై అభ్యంతరం

జనసేన అభ్యర్థి పవన్‌కల్యాణ్ గతంలో ఇచ్చిన నామినేషన్‌కు ఇప్పుడు ఇచ్చిన నామినేషన్‌కు తేడాలు ఉన్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ అభ్యర్థి జగ్గారపు మల్లికార్జున అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌ఓ రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ లిఖిత పూర్వకంగా అభ్యంతరం వ్యక్తం చేస్తే ఎన్నికల సంఘానికి పంపిస్తామని, వారు పరిశీలించి తేడాలు ఉంటే చర్యలు తీసుకుంటారని తెలిపారు. లిఖిత పూర్వకంగానే అభ్యంతరం వ్యక్తం చేస్తామని జగ్గారపు మల్లికార్జున తెలిపారు.

10 నామినేషన్లు ఆమోదం

- పారదర్శకంగా పరిశీలన
- ఈఆర్వో జేఎస్ రామారావు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పెద్దాపురం అసెంబ్లీ నియోకవర్గానికి సంబంధించి నామినేషన్ల పరిశీలన పారదర్శకంగా పూర్తి చేసినట్లు ఈఆర్వో, ఆర్డీవో జే.సీతారామారావు తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించారు. దాఖలైన 12 నామినేషన్లకు వైఎస్సార్ సీపీ తరఫున రెండో నామినేషన్‌గా దాఖలైన దవులూరి సుబ్బారావు, టీడీపీ నుంచి రెండోసారి దాఖలైన నిమ్మకాయల రంగనాగ్‌ల నామినేషన్లను తిరస్కరించగా మిగిలిన 10 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు గుర్తించామని ఆర్‌ఓ రామారావు తెలిపారు. వీటిలో దవులూరి దొరబాబు (వైఎస్సార్ సీపీ), నిమ్మకాయల చిన రాజప్ప (టీడీపీ) తుమ్మల దొరబాబు (కాంగ్రెస్), పెయ్యల అరుణ్‌కుమార్ (బీఎస్పీ), బుంగా సత్యనారాయణ (జై భీమ్‌రావు భారత్ పార్టీ), కేశవరపు రామ్మోహనరావు (ఇండియా ప్రజా బంధు పార్టీ) స్వతంత్రులుగా దువ్వాడ కన్నయ్య, మోటుపల్లి శివకుమార్, గంగవరపు లావణ్య, రాయుడు మోజెసన్‌బాబుల నామినేషన్లు ఆమోదించినట్లు రామారావు తెలిపారు. ఈ నెల 28న అభ్యర్థుల నామినేషన్ల ఉప సంహరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



వైఎస్సార్ సీపీ అభ్యర్థి దొరబాబు నామినేషన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ జేఎస్ రామారావు

నేను లోకల్.. పిలిస్తే పలుకుతాను !



చిత్రాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత
- చిత్రాడలో ఎన్నికల ప్రచారం



స్థానికులను ఆప్యాయంగా పలకరించి ఓట్లు అభ్యర్థిస్తున్న వంగా గీత

పిఠాపురం: నేను పక్కాలోకల్.. ఎవరు పిలిచినా వెంటనే పలుకుతా.. ఎప్పుడూ మీ వెన్నంటే ఉంటా.. నేను మంచి చేస్తానో, ఎప్పుడో చుట్టపు చూపుగా వచ్చిపోయే వారు మంచి చేస్తారు మీరే నిర్ణయించుకోండి అంటూ ప్రజల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత. పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటివరకూ ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని, మీ ఇంటి మనిషిగా, పిఠాపురం ప్రజల ఆడపడుచుగా అందరికీ సేవ చేసుకునే భాగ్యం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు ఆమెకు స్వాగతం పలుకుతుంటే ఆమె వారిని ఆప్యాయంగా పలకరించి అక్కున చేర్చుకున్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య అయినా పరిష్కరించే సత్తా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఉందన్నారు. మూడు పార్టీల కూటమిలో కుమ్ములాటలు తప్ప రాష్ట్ర ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏమాత్రం లేదన్నారు. మీ ఇంటి ఆడపడుచుగా.. మీ ఇంటిలో సొంత మనిషిగా ఏ కష్టం వచ్చినా మీకు అండగా నిలిచే తనను గెలిపించుకుని మరింత అభివృద్ధికి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సునీత, ఉప సర్పంచ్ కర్రి దుర్గాప్రసాద్, ఎస్సీ సెల్ నాయకులు గుడాల రామకృష్ణ, నాయకులు ఎస్.శ్రీనివాస్, బండారు సత్యనారాయణ, ఎస్.శివ, కందా శ్రీను, ఇందన సూరిబాబు, ఇందన సత్తిబాబు, రావు మైదార్, సీతారపు సూర్యాకాంతం తదితరులు పాల్గొన్నారు.

మీ వెంటే ఉంటాం.. గెలిపించండి



పెద్దాపురంలో తన భర్త దొరబాబుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న చంద్రకళ

- 14వ వార్డులో దవులూరి చంద్రకళ ప్రచారం

పెద్దాపురం: రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా సంక్షేమం కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, నియోజకవర్గ ప్రజలందరి వెంట మీకు అండగా ఉంటామని ఈ సార్వత్రికి ఎన్నికల్లో నా భర్త దొరబాబను గెలిపించరూ అంటూ పెద్దాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు సతీమణి చంద్రకళ కోరారు. పెద్దాపురం పట్టణంలో 14వ వార్డు వరహాలయ్యపేట ప్రాంతంలో ఆమె అయ్యారక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, ఆ వార్డు కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ మీలో ఒక్కడిగా, స్థానికుడిగా నియోజకవర్గ ప్రజలకు పరిచయస్తుడైన నా భర్తకు జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చారన్నారు. ప్రతీ ఒక్కరూ ఆయనను ఆదరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని చంద్రకళ కోరారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలు గుర్తించుకోవాలన్నారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని, నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడైన ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని చంద్రకళ కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళా అభిమానులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన



నాగులపల్లిలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ సూచించారు. మండలంలోని నాగులపల్లిలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ అధికారులకు సహకరించాలన్నారు. స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి వినోదం ప్రారంభం



వేసవి వినోదంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కాకినాడ సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి వేసవినోదం సహకరిస్తుందని కాకినాడ ఉపవిద్యాశాఖాధికారి ఆర్‌జె డేనియల్ రాజు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, వీబీవీఆర్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వేసవినోదాన్ని ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎం ఎమ్మెస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞాన అభివృద్ధికి వేసవి వినోదం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమ కన్వీనర్ కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పది రోజుల పాటు విద్యార్థులకు ఉపయోగకరమైన అనేకమైన విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రముఖ ఇంద్రజాలికుడు వీఎస్‌వీ రమణమూర్తి, పప్పెట్రీ శిక్షకులు పిల్లి గోవిందరాజులు పాల్గొన్నారు. పాఠ్యపుస్తక రచయిత కె.వెంకట్రావు, పదో తరగతి విద్యార్థులకు కాంతి అనే అంశంపై ప్రయోగశాలతో శిక్షణను ఇచ్చారు. గణిత అవధాని పి.రవిశంకర్ గణితంలో గమ్మత్తులు అనే విషయం మీద అనేక విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కె దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు: క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ క్రీడలు మనిషికి ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని అందిస్తాయని, పాఠశాల స్థాయి నుంచి క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ సుమలత వర్సిటీ ద్వారా క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ మాట్లాడుతు ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో కళాశాల వార్షికోత్సవాలు రద్దు చేశామని, ఎన్నికల అనంతరం నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రతిభ చూపిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమారి, స్పోర్ట్స్ కౌన్సెల్ కార్యదర్శి డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ అధ్వానం

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



తాగునీటి ఎద్దడిపై ఆదేశాలు జారీ చేస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

పెద్దాపురం: పట్టణంలో ఏ వీధిలో చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీలో పూడిక తీయక మురుగునీరు రోడ్లపై పారుతున్నా అధికార యంత్రాగం పట్టించుకోకపోవడంపై మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ మెయిన్‌రోడ్డులోని సారా వారి వీధిలో తొలగించిన షాపింగ్ కాంప్లెక్స్ వద్ద పిచ్చి తుప్పలు తొలగించకపోవడంపైనా, చెత్త నిర్వహణపై నిర్లక్ష్యంపైనా ప్రశ్నించారు. దీంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావీదురాజు, రాజశేఖర్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కమిషనర్ పద్మావతి కలిగించుకుని వారికి సర్దిచెప్పి పారిశుధ్య పనులు మెరుగుపరుస్తామన్నారు. చైర్‌పర్సన్ తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా మంచినీటి ఎద్దడిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మరో వైస్ చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మి, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఏకం కావాలి

- వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు రామకృష్ణ



చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు రామకృష్ణ

కొత్తపల్లి: నేతన్నల అభ్యున్నతి, అభివృద్ధి కోసం చేనేత కార్మికులందరూ ఏకమవ్వాలని వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పంపన రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ముప్పరపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో గురువారం చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించారు. చేనేతల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నేతన్న నేస్తం పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి సంవత్సరానికి రూ.24 వేలు అందిస్తున్నారన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా అర్హులైన చేనేత కార్మికులకు ఇళ్ల పట్టాలను అందించి ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలను మంజూరు చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గస్థాయి చేనేత కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వాకతిప్ప సర్పంచ్ పాలని దొరబాబు, కొత్తపల్లి ఉపసర్పంచ్ పొన్నగంటి రామకృష్ణ, ఇనుమర్తి భగవాన్, చింతలపూడి వీర్రాజు, గోపి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పశుపక్ష్యాదుల ఆకలి తీరుద్దాం



కాకినాడ బోట్‌క్లబ్ వద్ద పక్షుల చలివేంద్రంలో గింజలను పరిశీలిస్తున్న డాక్టర్ ఉమర్ ఆలీషా



చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న సత్యభామ

- సద్గురువు డాక్టర్ ఉమర్ ఆలీషా
- బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రాల ఏర్పాటు

కాకినాడ రూరల్: వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు మనషులతో పాటు పక్షులు, పశువులకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేకత అని సద్గురువు డాక్టరు ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ బోట్‌క్లబ్ వద్ద చలివేంద్రంతో పాటు పక్షులు, పశువులకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. నీటిని తమకు అందుబాటులో ఉంచమని పశు పక్ష్యాదులు ఆ భగవంతుడిని వేడుకుంటాయని, ఆయన ఏదో ఒక రూపంలో ఆ వనరులను ఏర్పాటు చేస్తాడని ఉమర్ ఆలీషా పేర్కొన్నారు. వాటి ఆకలి తీర్చడం భగవంతుడి సేవగా ప్రజలు భావించాలన్నారు. ప్రతి ఒక్కరూ పాత్రలో నీరు, ఆహార పదార్థాలు పెట్టాలన్నారు. ఎస్ఆర్ఐ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ డాక్టరు మురళీకృష్ణ, విశ్రాంత ఆర్టీఓ రామచంద్రరావు, పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

బోట్‌క్లబ్: స్థానిక చర్చిస్క్వేర్ సెంటర్‌లో రాయవరపు సత్యభామ కళావేదిక, హోప్‌ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని రాయవరపు సత్యభామ ప్రారంభించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఏటా చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనాగేంద్ర, శ్రీదేవి, మణి, హేమలత పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ బహూకరణ

తుని రూరల్: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన తిరుమలనీడి సాయికి తుని అలయన్స్ క్లబ్ ప్రతినిధులు ల్యాప్‌టాప్ బహూకరించారు. స్థానిక కొత్తపేటలోని సీతారామ యోగా సెంటర్‌లో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తుని పట్టణానికి చెందిన తిరుమలనీడి సాయికి రూ.60 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాన్ని (సర్టిఫికేట్) అందజేశారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించి, చేయూతనివ్వడం అలయన్స్ క్లబ్ బాధ్యతగా భావిస్తున్నట్టు అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు, కోశాధికారి దాసరి నూకయ్యశెట్టి, కంకిపాటి రామం, పరవాడ తాతబాబు, బి.నాగేశ్వర రావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



సాయికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పెద్దాపురం బార్ అధ్యక్షుడిగా మణి



పెద్దాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

పెద్దాపురం: పెద్దాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేదుల సుబ్రహ్మణ్యం పదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాదే నరసింహారావు, సారా రామచంద్రరావు, తాండ్రోతు నూకరాజు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన బార్ అసోసియేషన్ ఎన్నిల్లో అధ్యక్షుడిగా వేదుల సుబ్రహ్మణ్యం (మణి), ఉపాధ్యక్షుడిగా మడికి రాంబాబు, జనరల్ సెక్రటరీగా పిట్ల రమణ, జాయింట్ సెక్రటరీగా కందుల వెంకటాచలం, లైబ్రరీ సెక్రటరీగా దుర్గారావు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా పేరింశెట్టి బాలకృష్ణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా జమ్మి వెంకట కృష్ణారావు, పద్మాసిని, జూనియర్ ఎడ్యుకేట్ సభ్యులుగా సూర్యప్రభ, గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు పలువురు అభినందించారు.

నేడు డీఆర్ఎం రాక

సామర్లకోట: విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ శనివారం సాయంత్రం సామర్లకోట రైల్వే స్టేషన్‌కు వస్తున్నట్లు రైల్వే మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సామర్లకోట, పిఠాపురం రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం పిఠాపురం, సామర్లకోటల్లోని పుణ్యక్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక రైలులో ఆయన విజయవాడ వెళ్తారని చెప్పారు.